
# నివేదిత



గంధం యాజ్ఞవల్క్యశర్మ

మధుసూధనం, సుందరి, భావరాజు దగ్గిరదగ్గిర ఒకేసారి పరిచయమయ్యారు నాకు. సుందరితో పరిచయం ఎలా జరిగిందీ చెప్పాలంటే, ఒక చిన్నకథ చెప్పవలసిందే.

విశాఖ బదిలీ అయిననాటి మాట. వెళ్లి ఉద్యోగంలో చేరాను. ఆఫీసులో తాత్కాలికంగా మకాంపెట్టి, అద్దెకొంపలవేట ప్రారంభించాను. చెప్పులు పూర్తిగా అరిగి, పనికిరానంతగా పాడై పోలేదు కాని, అరిగిపోవటం ప్రారంభించాయి.

ఖాళీగాఉన్న కొద్ది కొంపలలో, నాకు నచ్చినవి మరీ కొద్ది. ఆ కొద్దిమంది "కుటుంబాన్ని ఎన్నాళ్లలో తీసుకొని వస్తారు?" లాంటి ప్రశ్నలు వేశారు. ఏం చెప్పను—?

సమాధానంగా . . . వారికేం సమాధానం చెప్పకుండా, మరోవీధికి నా ప్రయాణం సాగించేవాణ్ణి.

ఒకనాటి ఆదివారం, మధ్యాహ్నం ఓ పెద్ద మేడ ముందు క్షణమాగి, ముచ్చటవేసి లోనికి వెళ్లాను. ఆ మేడలో అద్దెకు భాగాలుంటాయనికాని, అలాంటి శ్రీమంతులు అద్దెలమీద జీవిస్తారనిగాని కాదు. అయినా వెళ్లి హాలులో ఉయ్యాల బల్లమీద కూర్చొని ఒంటరిగా చదరంగం ఎత్తులు వేసికొంటున్న ఆయన్ని "ఏమైనా అద్దెకు భాగాలున్నాయా?" అని అడిగాను.

ఆయన నామాట వినిపించుకొన్నట్లు లేదు. ఏవో ఎత్తులు పై ఎత్తులు వేసికొంటూ అలాగే ఉండి పోయాడు.

మరోమారు అడిగాను. సమాధానంలేదుకదా, అసలాయన నాకేసి చూసినట్లేలేదు. మరోమారు అడగటమా, లేదా అని అనుకొంటూ ఉండగా, మేడ మెట్లమీదనుండి "మామయ్యా" అంటూ వచ్చి నన్ను చూచి ప్రశ్నార్థకంగా నిలిచిపోయింది ఒకామె.

ఆమే సుందరి.

ఆయన, ఆమె మేనమామగారు దాశరథి; అంతటి గృహంలోను వాళ్లిద్దరే. మరెవ్వరూలేరు. అటు సుందరి

తల్లిదండ్రులు ఇటు దాశరథి భార్య . . . . అంతా గతించగా దాశరథి, సుందరి మిగిలారు. శ్రీమంతులు. కారు, తోట, బంగళా, బోలెడు మణిమాన్యాలు ఉన్నాయి.

ఇవి నేను తరవాత తెలుసుకొన్న విషయాలు.

దాశరథిని వృద్ధాప్యం ఆవరించిందనే విషయం నిర్వివాదాంశం అన్నట్లు తెల్లగా నెరిసిపోయిన జుట్టు, ముడతలు పడుతూన్న శరీరం సాక్ష్యం ఇస్తున్నా, 'జీవితంలో, ఎంతో కోల్పోయిన వ్యక్తి కావటం మూలాన అలా అయిపోయాడు' అనే వాదానికి ఆస్కారం లేక పోలేదు.

50 సంవత్సరాలుంటాయి. ప్రపంచం ఎటుపోయినా ఆయనకు పట్టదు, ఆ చదరంగం ఆటతప్ప. అంతా 20 సంవత్సరాల వయస్సన్నా సరిగ్గాలేని సుందరే చూచుకోవాలి.

దాశరథివి రెండే అభిరుచులు. తీరిగ్గా ఉయ్యాల బల్లమీద కూర్చొని చదరంగపు ఎత్తులు వేసికోవటం, లేకుంటే సోఫాలో కూర్చొని చుట్టలు కాల్చుకోవటం. ఆ గృహంలోని వంటమనిషి నుండీ, తోటమాలి వరకు అందరికీ యజమాని అంటే సుందరే.

సుందరి మాటకున్న విలవ మొదటిరోజే తెలిసింది నాకు — . . . . ఆ రోజలా, మేడ మెట్లమీదినుండి దిగి వచ్చిన సుందరి క్షణంసేపలా ఆగి, నేను వాళ్ల మామయ్య కోసం వచ్చాననుకొని, "సోఫాలో కూర్చోండి" అని ఆహ్వానించింది.

కొంచెం బెరుగ్గానే కూర్చొన్నాను.

"మామయ్యా. . . . కొంచెం సమాధినుండిలేచి, వచ్చిన పెద్దమనుషులనైనా గుర్తించకుంటే ఎలా?..." అంటూ ఆయన్ని నిద్ర లేపింది.

నిద్రనుండి మేల్కొన్నట్లే — 'ఏం కావాలి—?' అన్నట్లు చూచారాయన.

"అద్దెకిచ్చే భాగాలు — " అన్నాను.

ఆయన మాట్లాడలేదు. నాప్రశ్న అర్థం కానట్లే కనిపించారు. కాని సుందరి మాట్లాడింది.

"అద్దెకు భాగాలా? . . . అబ్బే లేవండి; మామయ్య చదరంగపు స్నేహితులేమో అనుకొన్నాను."

లేచాను. బయట రోహిణి ఎండ మాడిపోతూంది. "పోనీ కొంచెంసేపు కూర్చోండి. ఎండ మాడి పోతూంది" అంది సుందరి. ఆ చదరంగపు బల్లముందే కూర్చొన్నాను. దాశరథి ఉత్తేజితుడైనట్లు కళ్ళు పెద్దవి చేసి — "వేద్దామా, ఒక్క ఆట" అన్నాడు.

కానిమ్మన్నాను.

ఆట ప్రారంభించాం. అజ్ఞాతంగా నాలోఉన్న ప్రతిభను దాశరథి రెచ్చగొట్టి వెలికి తీశాడు. ఎంతకాలం హరించి పోయిందో . . . చీకటి పడింది . . . సైరను కూసింది, ఆట ముగిసేపాటికి. దాశరథి కౌగలించు కొన్నంత పని చేశాడు.

"ఎన్నాళ్ళయింది, ఇలాంటి జతలో ఆట ఆడి" అని పొంగిపోయాడు.

"వస్తాను" అన్నాను లేస్తూ.

ఎక్కడ విన్నదో "మాస్టారూ, క్షమించాలి, మీకు ముందు చెప్పనందుకు. మీరూ మాతోనే భోజనం చేయపోతున్నారు, ఈ పూట వంటా సిద్ధంగా ఉంది" అంది సుందరి.

"అబ్బే, ఎందుకూ?" అన్నాను.

"కాదు, నన్ను క్షమించాలి —" దాశరథి రెండు చేతులు పట్టుకొన్నాడు.

తువ్వాళ్ళు తీసుకొనివచ్చి, ఇచ్చి స్నానాలగదికేసి దారి తీసింది సుందరి.

సుందరి మాటకున్న విలవ అల్లాంటిది. తప్పించుకోవటం సాధ్యం కాదు.

భోజనం అవుతూ ఉండగా, అయ్యాక, చదరంగాన్ని గురించి అనర్గళంగా ఉపన్యాసం ఇస్తున్నాడు దాశరథి. తాంబూలాలు వేసికొంటూ ఉండగా సుందరి అంది "మామయ్యను ఈనాడంత సంతోషంగా మరేనాడూ చూడలేదండి మాస్టారూ! ఈ ఇంటిలో అద్దెకు భాగాలు లేవుకాని, మీరు మాత్రం ఈ ఇంటిలో ఉండి పోతున్నారికమీదట. ఈ ఉత్తరపు వైపుగది మీది."

అంతే. ఆ ఇంటిలో ఒక మనిషినయ్యాను నే నాటి నుండి. ఏనాటి ఋణానుబంధమో, ఆ ఆలయంలో!

సుందరి బి. ఎ. ఆనర్సు చదువుతూంది, యూనివర్సిటీ కాలేజీలో. ఎంతో చలాకీగా ఉండేది. సుందరి మూలంగానే మధుసూదనం, భావరాజు పరిచయమయ్యారు. వాళ్లిద్దరూ సుందరి క్లాస్‌మేట్స్.

మధుసూదనం జడ్జిగారబ్బాయి. కాలేజీ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడు. పచ్చగా, కోలగా, మిలమిలలాడే

> **ప్రేమలేఖ**
>
> మంచి ప్రేమలేఖ వ్రాయడమంటే నీవేం చెప్పాలో నీకు తెలియకనే ఆరంభించాలి. నీవేం వ్రాశావో తెలియకుండానే ముగిసిపోవాలి.
>
> —టూహో

కళ్లతో బాగానే ఉంటాడు. స్కూటరుమీద వస్తూ ఉంటాడు సుందరి కోసం.

భావరాజు రచయిత. భావకవిత్వం వ్రాస్తాడు. వ్రాసిన దానికంటే బాగా చదువుతాడు. చదువుతూ బాగ బాధపడతాడు. జానపాల జుట్టు, గుండ్రటి ముఖం. . . . అందంగానే ఉంటాడనాలి.

సుందరి కాలేజీ విద్యార్థినీ ప్రతినిధి. ఆమెకున్న రాజకీయ, సాంస్కృతికాభిరుచుల చిహ్నం, వీళ్లిద్దరి తోటి స్నేహం. వీళ్ల ముగ్గురికీ నేను మాస్టారినే. జీవితం చూపిన అనుభవాల సుడిగుండాలనుండి తేరుకొని చూచుకొనేపాటికి కొన్ని పలితకేశాలు, కంటి క్రింద నల్లటిచారలు, ఎక్కడో మేల్కొంటున్న వార్థక్యపు ఛాయలు, నన్ను ఆశ్రయించాయని తెలుసుకొన్నాను. 40 సంవత్సరాల వ్యక్తి ఈ దేశంలో పెద్ద తల కింద లెక్క. అనుమానంలేదు. అందువల్లనే అనుకొంటాను, వాళ్ల ముగ్గురికి నేను, మాస్టారిని.

అలాంటి నన్ను — "మేష్టారూ, ప్రేమంటే ఏమిటి —?" అని, సూటిగా సుందరి ప్రశ్నించింది, ఒకనాటి సాయంత్రం, గదిలో కూర్చొని ఏదో చదువు కొంటూ ఉండగా.

గతుక్కుమన్నాను.

'ఈ పరబ్రహ్మ స్వరూపం ఏమిటి అన్నట్లు!' ఉక్కిరిబిక్కిరి అయ్యాను. అసలిలాంటి ప్రశ్న సుందరి నన్నడగటమేమిటి?

తెల్లపోయి చూచాను. మెదడంతా పని మాని వేసినట్లు అన్పించింది. ప్రేమనుగురించి, ఆలో చించి ఎన్నాళ్లయింది! నా అనుభవమైన ప్రేమ వృత్తాంతమేనాటిది! ఈ జీవితంలో ప్రేమ జలధి ఇంకిపోయి 15 సంవత్సరాలయింది. కనులలో నా ప్రేమమూర్తి సరూ మెదిలింది.

ప్రేమంటే ఏమని చెప్పను?

15 సంవత్సరాలు వెనక్కి వెళ్లి, సరూ అనే నా ఆత్మ బంధు ఉండేది ఆమెను అడిగి వస్తానని చెప్పనా?

సమాధానం లేక నిశ్చలంగా ఉన్న నన్ను చూచి — "అదికాదు మాస్టారూ! ప్రతివాడూ ప్రేమ, ప్రేమ అంటూ ఇదే పాట. . . . అబ్బా! వినుగు పుడుతూంది" అంది సుందరి.

అప్పటికి అర్థమయింది నాకు 'నాముందున్నది సుందరి ప్రశ్నకాదు, ఆమె ఎదుర్కొంటున్న సమస్య' అని.

"దానిదేముందమ్మా, ఇది లోకం. పైగా ఆట్టే ఎదిగీ ఎదగని దేశం మనది. పట్టించుకోకుండా పోతే పోతుంది" అన్నాను.

'కాకుంటే నేను మాత్రం ఈ జాబులన్నీ చదువుతూ కూర్చొన్నానా మాస్టారూ? వచ్చినవి వచ్చినట్లు, కవర్లన్నా విప్పకుండా చింపి పారవేస్తున్నాను. ఎటొచ్చి అందరిలా మధుసూదనం కూడా —" చిరాకుగా ఆగిపోయింది సుందరి.

ఆశ్చర్యపోయాను. "మాస్టారూ, మాస్టారూ" అని ఎంతో అమాయికంగా ఉండే మధుసూదనం!

"మధుసూదనమా . . .?" అన్నాను.

"ఆఁ. మధుసూదనమే, సాయంత్రం బీచిలో, 'ప్రేమట ... ఒంటరిగా చెప్పాలని ఎన్నాళ్లనుండో ప్రయత్నిస్తున్నాడట .... అవకాశం చిక్కింది కాదట... ఏవేవో మాట్లాడాడు...'' ఆవేశపు పాలును నిర్లక్ష్యంతో కలిపి మాట్లాడింది సుందరి.

"పోనీలే... నేను చెపుతాను మధుసూదనానికి" అన్నాను, ఏమనాలో తోచక.

"నేనే చెప్పాను, వెర్రి మొర్రి ఆశలు పెట్టుకోవద్దని, ఇలాంటి అనాలోచితమయిన అధిక ప్రసంగాలతో స్నేహాన్ని కలుషితం చేయవద్దని" అంది సుందరి.

సుందరికేసి చూచాను. నిజాయితీని, నిర్భయాన్ని ఆభరణాలుగా ధరించిందా? అనిపించింది.

"వస్తాను మాష్టారూ!" అంటూ విసురుగా వెళ్లిపోయింది మేడపైకి. సుందరి పైకి వెళ్లాక ఆలోచించాను, సాగిపోతున్న ఈ ప్రగతిపథంలో స్త్రీ స్థానం, భద్రతలను గురించి ఎందుకో నిరుత్సాహం, భయం వేసింది.

మధుసూదనాన్ని గురించి ఆలోచించాను. అతని తప్పూ కనిపించలేదు. యువకుడు. స్త్రీ నర్థం చేసుకోగల తరుణం కాని వయస్సది. పరవళ్లు తొక్కుతున్న హృదయాన్ని సుందరి ముందుంచాడు. అతనితో నాకున్న పరిచయాన్ని పట్టి వీలయితే ఏదైనా చెవుదామనుకొన్నాను. ఏం చెప్పాలో నిర్ణయించుకోలేక పోయాను.

పల్లెలోని పంట వసూళ్లకు గ్రామాలు దాశరథి వెళ్లాడు. సంవత్సరం మొత్తంలోను, ఊరు వదిలి దాశరథి వెళ్లవలసిన పని అది ఒక్కటే.

నాలుగురోజులు మధుసూదనం కనిపించనేలేదు. భావరాజు మాత్రం సుందరితో కారమ్సు ఆడుతూ, కాలేజీ కబుర్లు చెప్పుకొంటూ కనిపించాడు.

నాల్గవనాటి సాయంత్రం మేడ వెనకాల తోటలో తిరుగుతూ ఉండగా "మాష్టారూ?" అంటూ వచ్చింది సుందరి.

"ఏమిటీ?" అన్నాను.

"జాలిలోనుండి ప్రేమ పుడుతుందా—?" ప్రశ్నించింది.

ప్రేమతో పెనవేసుకొన్న ఆ ప్రశ్న నాకు, క్రిందటి జన్మలోని పాత్యాంశలా తోచింది. ఏమిటో లీలామాత్రంగా సమాధానం గోచరించినట్లే గోచరించి అదృశ్యమయింది.

జాలిలో ప్రేమ పుడుతుందో. జాలే ప్రేమో. అసలు జాలి ముదిరితే ప్రేమగా మారుతుందో. . . లేక ప్రేమ చిన్నచిన్న అణువులుగా విడివడి, జాలిలా ప్రవహిస్తుందో . . . ఒకదాని రూపాంతరం మరొకటి ఏమిటో చెప్పలేక పోయాను.

"అదేనండి, మధుసూదనం మళ్లీ సైన్సులాబ్ వెనక కనపడి, తన హృదయం భగ్నంఅవుతూంది అని విలపించాడు" అంది.

'ఇదెక్కడి మధుసూదనం!' అనిపించింది.

గులాబీపువ్వు నొకదానిని కోసి, దాని సౌందర్యాన్ని తిలకిస్తూ "మాష్టారూ, మనుష్యులిలా ఎందుకు మాట్లాడతారో దిగజారిపోయి, అర్థంకాదు నాకు. నాలో జాలిపుట్టి, తనను ప్రేమించాలిట. ఏమిటది?" అంది.

చీకటి పడింది.

"వెళదాం. . ." అన్నాను.

హాలులోకి వచ్చాం. హాలులో భావరాజు కూర్చొని ఏదో గీతాన్ని సన్నగా ఆలాపన చేస్తున్నాడు. సుందరి ఆతనితో కబుర్లలోకి దిగిపోయింది. నేను నా గదిలోకి వెళ్ళాను.

మధుసూదనాన్ని కలుసుకుంటే బాగుండు ననిపించింది. వెదకపోయిన తీగ కాలికి తగిలినట్లు మధుసూదనమే వచ్చాడు. ఆ నాటి అర్ధరాత్రి 2 గంటలయి ఉంటుంది అనుకొంటాను. తలుపు చప్పుడైతే, తీశాను. మధుసూదనం. తలంతా చెరిగి ఉంది. కళ్ళు జ్యోతుల్లా ఉన్నాయి.

"ఏమిటి మధుసూదనం?" అన్నాను.

"సుందరితో మాట్లాడాలి మాష్టారూ" అన్నాడు.

"ఇంతటి అర్ధరాత్రి, పాపం, మంచి నిద్రలో ఉండి ఉంటుంది. ఇలారా. . ." అని నా గదిలోకి తీసుకొని వెళ్లాను.

"చూడు, మధుసూదనం! నాగరిక ప్రపంచంలో ఉన్న మనలాంటి విద్యాధికులు స్త్రీలపట్ల మెలగవలసిన పద్ధతి ఒకటి ఉందనే విషయం, నీవూ ఒప్పుకొంటావు కదూ?" అన్నాను.

మధుసూదనం పొరలిపొరలి ఏడ్చాడు. నిశ్చేష్టుణ్ణి అయ్యాను.

మధుసూదనం వయస్సును, సుందరి మాట్లాడిన తీరును సమన్వయ పరిచి, ఇదేదో మామూలు ప్రేమ పిచ్చి అనుకొన్నాను కాని, మధుసూదనం ఇంత గాఢంగా సుందరిపట్ల మనస్సు లగ్నం చేశాడనుకోలేదు.

మధుసూదనాన్ని ఎలా ఊరడించాలో తెలియలేదు.

"మాష్టారూ, ఆమె నన్ను వివాహమాడకపోతే, నాకీ జీవితం అనవసరం" అన్నాడు.

ఏం సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.

"ఏదో ఒకటి ఈ రాత్రి తేల్చుకోవాలని వచ్చాను. నా జీవితంలో ఈ రాత్రి మైలురాయి. . ." ఏదేదో అన్నాడిలా.

అతని మనస్సు నొచ్చకుండా సుందరికి అతనిపట్ల ఉన్నభావాలు చెప్పాలనిపించింది.

"మధుసూదనం, వివాహం లాంటి ముఖ్య విషయాలలో నిర్ణయాలను తీసికొన వలసిన భాగస్వాములు ఇద్దరు' అని నీకు తెలుసుగా. మరి సుందరికి ఇష్టానిష్టాలుంటాయని నీవు గుర్తించాలి."

"మేష్టారూ, నిజం చెప్పాలంటే, సుందరికి నేనంటే ఇష్టమే. నాతో తిరిగినట్లు మరెవ్వరితోనూ తిరగదు. ప్రేమ విషయాలు, సెక్సు. . . అన్నీ మాట్లాడుతుంది నాతో. . . కాకుంటే ఏదో చులకనగా, నన్ను ఆటలు పట్టించాలని. . . ఇలా చేస్తోంది. అంతే."

మధుసూదనం ఎంతటి పిచ్చి ఊహలో ఉన్నాడు! మధుసూదనాన్ని ఒక్క షరతుమీద పంపించివేశాను, నేనే ఈ విషయం సుందరితో మాట్లాడి, ఆవిడ ఖచ్చితమైన అభిప్రాయం అతనితో చెప్పేటట్లు. మధుసూదనం తిరిగి వెళుతూ ఒకసారి జాలిగా 'మాష్టారూ! నా జీవితభవిష్యత్తు మీ చేతులలో వుంది' అన్నట్లు చూచి వెళ్ళాడు.

అతనలా వెళ్ళాక, ఈ ధర్మకర్తృత్వం ఎందుకు నెత్తిన వేసికొన్నానా అనిపించింది. ఒక విధంగా సుందరిముందు మాట్లాడుతుంటే నాకూ భయమే.

మధుసూదనం అర్ధరాత్రి వచ్చినట్లు సుందరికి నేను చెప్పనేలేదు. మరునాడు భోజనాలయ్యాక, తాంబూలం వేసుకొని సుందరి గదిలోకి వెళ్ళాను.

తలగడల మధ్య లతలా ఒయ్యారంగా ఒదిగిపోయి, టేబిల్‌లైటు వెలుగులో ఏదో చదువుతూంది. నన్ను చూచి, "రండి మాష్టారూ!" అంది, కుర్చీ చూపుతూ.

కూర్చొంటూ "ఏమిటది?" అన్నాను.

"ఏదో గీతం. భావరాజు కొత్తగా వ్రాసింది."

"బాగుందా?"

"ఆయన బాగానే వ్రాస్తారనుకొండి ... ఇదేదో నిష్కామ ప్రేమను గురించట . . . నాకేమీ అర్థం కావటంలేదు" అంది.

ఇదే సమయమనుకొని ప్రారంభించాను — "అసలు ప్రేమమీద నీ అభిప్రాయం ఏమిటీ?" అని.

సుందరి అదోలా చూచింది. ఫాన్ గాలికి, ఆమె ముంగురులు కదులుతున్నాయి. ఆ గాలికే ఆమె చేతి లోని కాకితం ఎగిరిపోయింది. లేచి కూర్చొంటూ "ప్రేమమీద అభిప్రాయం అంటూ నాకేమీలేదు, మాష్టారూ! కానీ, ప్రేమపట్ల నా నిర్ణయం ఉంది. ఈ జీవితంలో ఈ ప్రేమలకు దూరంగా తొలగి ఉందామని."

"అలాగైతే నీవు పరిపూర్ణమైన వ్యక్తివి కాకుండా మిగిలిపోతావు."

చిన్నగా నవ్వింది. "ఎవరన్నారు. . . మధుసూదనం అన్నాడా రాత్రి?"

గతుక్కుమన్నాను.

"రాత్రి గేటుమూసిన తోటమాలి రంగయ్య చెప్పాడు లెండి, మధుసూదనం వచ్చి వెళ్ళిన సంగతి. మధుసూదనాన్ని విజ్ఞతకు విఘాతం కానివిధంగా మసులుకోమని చెప్పటానికి మీరు జంకవలసిన పనేమిటి మాష్టారూ. . .?" అని ప్రశ్నించింది.

సుందరి ముందు ముద్దాయి నయినాను. మరేమీ మాట్లాడక తిరిగి వచ్చివేశాను. ఈ విషయం చెపితే, మధుసూదనం గోడుగోడుమంటాడు. ఎలా. . . ఏమయినా సరే అతనికీ చేదు నిజం చెప్పక తప్పదు.

మధుసూదనం నన్నాశ్చర్యపరిచాడు. నే చెప్పిన సమాధానం విని, ఒక్క క్షణం ఎటో చూచినట్టు చూచి, ఏదో ఆలోచించి, "వస్తాను మాష్టారూ!" అంటూ వెళ్ళిపోయాడు.

ఒకవిధంగా తృప్తి పడ్డాను.

దాశరథి తిరిగి వచ్చాడు పల్లెటూరినుండి. తాను ఈ 10, 15 రోజులుగా చదరంగం ఆడకపోవటం వలన ఎంత నిస్సారంగా తయారయింది, అక్కడ ఆ పల్లెటూరిలో జీవితం తన కెలా కాలక్షేపం కాకపోయింది చెప్పి, నన్ను మూడు రోజులు సెలవు పెట్టమన్నాడు, ఏకధాటిగా చదరంగం ఆడుకోవటానికి.

దాశరథి భోజనమైనా మానెయ్యగలడు కాని, చదరంగం మాత్రం మానెయ్యలేడేమో అనిపించింది.

దాశరథి కోరిక మేరకు సెలవు పెట్టాను. కాని,



పర్ణ సంఘోదనం
చిత్రం — ఎస్. ఆనందపల్లి (మద్రాసు—21)

చదరంగం కోసం పెట్టిన సెలవు మధుసూదనం కోసం వినియోగించవలసి వస్తుందని నే ననుకోలేదు. దాశరథి, నేను అలా చదరంగం దగ్గిర కూర్చొన్నామో లేదో పిడుగులాంటి వార్త వచ్చింది ఫోనులో.

మధుసూదనం కారు క్రింద పడ్డాడట! ఈ వార్త వింటూనే సుందరి కెవ్వున కేకవేసి దిగ్భ్రాంతి చెందింది.

మరో కొద్ది సేపటికల్లా సుందరి, దాశరథి, నేను హాస్పిటలు చేరాము. మధుసూదనం కట్లు కట్టబడి స్పృహలేని స్థితిలో ఉన్నాడు. ప్రమాదం లేదన్నారట డాక్టరు. భావరాజూ, మరి కొందరు మిత్రులూ ఉన్నా రక్కడ.

రోజూ స్కూటరుమీద వచ్చే మధుసూదనం, ఆ నాడలా నడిచిరావటం, అట్టే జనసందోహం కాని, కార్ల ఒత్తిడి కాని లేని అక్కడ కారుకింద పడటం ఆశ్చర్యంగా ఉంది చాలామందికి. నా దృష్టి సుందరి వైపు మళ్ళింది. సుందరి కనులవెంట ధారావాహికంగా నీరు కారుతూంది.

ఆశ్చర్యపోయాను. నా ఈ ఆశ్చర్యం రెండు మూడు దినాలలో ఎన్నో రెట్లు అయింది, సుందరి ఇరవై నాలుగు గంటలూ హాస్పిటల్లో మధుసూదనం పక్కనే

ప్రాణాన్ని అతని సేవలో మునిగిపోపటంతో.

ప్రమాదం జరిగిన సాయంత్రం "మాష్టారూ, మధు నాన్నగారికి నెల్లూరికే బదిలీ అయి వెళ్ళిపోయారు దూరంగా. ఇక మధుకు అన్నీ మనమే. నాతోపాటు మీరూ శ్రమ తీసుకోవాలి" అంది సుందరి.

ఇంతటివరకు సుందరి నాకు నాగరికతా ప్రతిబింబమైన ఆధునిక యువతిగానే కనిపించింది. కాని, ఆమె మధుసూదనంపట్ల చూపుతున్న ఆ శ్రద్ధ, ప్రతి క్షణానా కంటికి రెప్పలా అతనిని అంటిపెట్టుకొని ఉండటం చూశాక, ఆమె పరిపూర్ణమైన స్త్రీగా గోచరిస్తుంది. నిజంగా 20 సంవత్సరాలైనా నిండని సుందరిలో మూర్తీభవించిన ఆ సేవానిరతి, మాతృత్వపు ఛాయలు చూచి విస్మయం పొందాను. నే నక్కడ కేవలం ప్రేక్షకుడిలా ఉండి పోవలసి వచ్చింది. అంతకంటే నేను చేయవలసినది, చేయకలిగింది ఏమీ లేదు. అంతా సుందరే చూసుకొనేది.

మధుసూదనాన్ని ఉంచింది స్పెషల్ రూములో అవటాన నేను, సుందరి రాత్రిళ్ళు కూడా ఉండటానికి వీలయింది. ఓనాటి అర్ధరాత్రి లేచి చూసేసరికి మధుసూదనం కాళ్ళను వాటర్‌బాటిల్‌తో కాస్తున్న సుందరి కనిపించింది. నా కనిపించింది, 'ఎన్ని పూర్వ జన్మలలో సుందరి తల్లి పాత్ర నిర్వహించిందో'—అని.

మధుసూదనానికి, తలమీది గాయం తగ్గటం ప్రారంభించాక, హాస్పిటలునుండి విడుదల చేయించి, సుందరి ఇంటికి తీసికొని వచ్చింది. డాక్టరువచ్చి, ఇంటిదగ్గరే రెండు రోజులకొకసారి కట్టుకట్టిపోయేవారు.

ఓనాటి సాయంత్రం పోలీసు ఆఫీసరు వచ్చి, ప్రమాదం జరిగిన నాటి సంఘటనను గురించి ప్రశ్నించటంతో పోలీసువారికి కేసు పెట్టవలసిన అగత్యం లేకుండా పోయింది. కాని. . . నాకు మాత్రం ఆ సంఘటనను గురించి ఆలోచించవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

పోలీసు ఆఫీసరుతో తన పొరపాటు వలననే ప్రమాదం జరిగిందని. . . ఎవరిమీదా ఎలాంటి చర్య అవసరంలేదని చెప్పాడు మధుసూదనం.

మధుసూదనం మాటలు విన్నాక అతనే ఆత్మహత్య లాంటి దానికై ప్రయత్నించాడా అనే అనుమానం నాలో పురులు విప్పింది. సుందరి ఏదో పనిమీద కిందకు వెళ్ళినప్పుడు అడిగాను మధుసూదనాన్ని.

చిరునవ్వు నవ్వాడు.

"మాష్టారూ, నిజమేదో, నటనేదో, తెలుసుకోవాలను కొన్నాను. నా పథకాన్ని అమలు జరిపి చూచాను. నటన నటనే. తేలిపోయింది. సుందరికి నా పట్ల ఉంది ప్రేమే నంటే, ఆ నాటి రాత్రి మీరు నమ్మారు కాదు" అన్నాడు మధుసూదనం.

మధుసూదనం ఒక విధంగా జీవితంలో సాహసి అనిపించింది. కాని వ్యక్తులను గురించి అతనికున్న కొలతలు, వారి ప్రవర్తనకు అతను చెప్పుకొనే అర్థం సరైనదేనా అనేది అనుమానాస్పదమైన విషయం. సుందరి మనస్సును అతను ముద్రించుకోవటంలో చాలా ముద్రారాక్షసాలు దొర్లాయనిపించింది.

మధుసూదనం పొరపాటు పడుతున్నాడనటానికి అట్టే చూపదగిన నిదర్శనాలు లేవు. సుందరి ఆలోచనలు, ఆచరణ, అంతరాత్మ ఎవరికీ అర్థం కావు.

ఆ నాటి అర్ధరాత్రి వరకు దాశరథితో చదరంగం ఆడుకొని, మధుసూదనం గదికేసి వెళ్ళాను. గదినుండి మాటలు వినిపిస్తున్నాయ్. కిటికి దగ్గరే ఆగిపోయాను.

"పిచ్చిమధు, ఎంతటి అవివేకమైన పని చెయ్య పోయావో చూడు! మనం ఎందుకు జీవించాలి, ఎందుకు జీవించకూడదు అనేది నిర్ణయించవలసింది మనం కాదు. భగవంతుడు. మన విధి భగవంతుడిచ్చిన జీవితమనే అవకాశాన్ని వినియోగించుకోవటమే. జీవితం సుఖాల స్రోవూ కాదు; దుఃఖసముద్రమూ కాదు. ద్వంద్వమైనది. రెంటినీ నిమిత్తమాత్రంగా మనం స్వీకరించాలి

"ప్రేమంటావు. ప్రేమ పర్యవసానం శాంతి ప్రశాంతత కదూ? ప్రేమను ప్రత్యేకంగా కొందరి కోసం పదిల పరచటం మన తక్కువతనాన్ని చూపుతుంది. సర్వ మానవసౌభ్రాత్రం పెంపొందించుకొంటే ప్రతిదీ ప్రేమమయంగా ప్రేమలోని అంతర్భాగంగా కనిపిస్తుంది.

"పిచ్చి మధు, నిన్ను నే నెందుకు ప్రేమించటం లేదు. . . . . . ప్రేమిస్తున్నాను. . . నాకే ఒక సోదరుడంటూ ఉంటే ఇలాగే ప్రేమించేదాన్ని. . ."

మధు విషయం నాకు తెలియదు. నేను మాత్రం స్తబ్ధత వెందాను. సుందరిపట్ల నేనేర్పరుచుకొన్నభావాలు సత్యదూరం కావు. ఆమె ఒక మహత్తరమైన వ్యక్తి.

> **లేఖలు**
>
> జాబులూ జవాబులూ అవి ఎవరికి ఉద్దిష్టాలైనవో వారినేకాక, అవి వ్రాసిన వారినీ బహిర్గతం చేస్తాయి.
>
> —చెస్టర్ ఫీల్డ్

మధు సమాధానం కోసం కొన్ని క్షణాలు వేచిఉన్నాను. అతని నుండి ఎలాంటి సమాధానమూ లేదు. 'బహుశా అతను సన్నగా విలపిస్తూనైనా ఉండాలి, లేదా అతని జ్ఞాననేత్రం తెరుచుకొని సుందరిలోని అత్యున్నత భావశిఖరాలను, ఆమె మానవత్వంలోని వైభవాన్ని నిశ్చేష్టితమై చూస్తూ అన్నా ఉండాలి' అనిపించింది.

నా గదికి వచ్చివేసి సుందరిని గురించి ఆలోచిస్తూ ఉండిపోయాను. ఎప్పుడు నిద్ర పట్టిందో. . . తెల్లగా తెల్లవారినంతవరకూ మెలకువ వచ్చిందికాదు. అదీ పనిమనిషి ఏమిడమ్మ వచ్చి లేపింది. పండ్లుతోముకోవటానికి స్నానాల గదివైపు పోబోతూండగా ఏమిడమ్మ చెప్పింది.

"అమ్మగారు కారేసుకుని పొద్దున్నే రైలుకాడికెళ్ళారయ్యా."

"ఎందుకు—?" అన్నాను.

"ఏమో!" అంటూ తన ఆశ్చర్యాన్ని కొంత నాకూ పంచిపెట్టింది ఏమిడమ్మ. పండ్లు తోముకుని బయటకు వచ్చేసాటికి గారేజిలో కారునుంచి వస్తున్న సుందరి కనిపించింది. ఎలాగానో ఉంది. రేగిన జుట్టు, నలిగిన బట్టలు, అలసట చెందిన మోము. సుందరి అలా బయటకు వెళ్ళటం ఊహించలేని విషయం. నాతోపాటే నా గదిలోకి నడిచి, "మాష్టారూ, ఈ జాబు చదవండి" అంటూ ఓ కాకితం నా ముందుం చింది.

"సుందరీ,

నేను, దేనిని భరించలేని వ్యక్తిని. కొన్నాళ్ళు నీ ఎడల విరహాన్ని భరించలేకపోయాను. ఇప్పుడు నీ మంచితనాన్ని భరించలేకపోతున్నాను. నేను వెళుతున్నాను.

కృతజ్ఞుణ్ణి,

మధుసూదనం."

మధు ఉదంతం ఇలా ముగుస్తుందని అనుకోలేదు నేను. "ఈ జాబు ఎవరిచ్చారు?" అన్నాను.

"తెల్లవారుజామున 5 గం. లకు మధుకు ఏం పరిస్థితైనా ఉందేమో చూదామని వెళ్ళాను అతని గదిలోనికి. టేబుల్‌పైన ఈ జాబుంది. క్రిందికి వచ్చాను. గేటు తెరిచిఉంది. ఎలాగైనా మధును ఆపాలని రైల్వేస్టేషనుకు వెళ్ళాను. మధు కనిపించలేదు."

సుందరి కనులలో రెండు కన్నీటి బొట్లు కనిపించాయి. "మాష్టారూ! నేనేం చేశాను మధు ఇంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించాలి చెప్పండి?" అని ప్రశ్నించింది.

"నిర్దాక్షిణ్యమేముందమ్మా. . . ఏవో తన తల్లి దండ్రులను చూడాలనుకొని వెళ్ళుంటాడు" అన్నాను.

"అంతేనంటారా? అయితే నాకు చెప్పి వెళ్ళవచ్చుగా. కారులోనే స్వయంగా వదిలిపెట్టి వచ్చేదానినిగా. తన కింత ప్రమాదం జరిగినా, తన తండ్రికి వ్రాయవద్దన్న వ్యక్తి ఇలా సరిగ్గా నడవలేని ఆ కాళ్ళతో, చీకటిలో ఏం కర్మ వచ్చిందని ఇలా పారిపోవాలి?"

కిటికీనుండి లోపలికి అప్పుడే వస్తున్న సూర్య కిరణాల వెలుగు సుందరి చెంపలపై, జారిపోతున్న ఆ కన్నీటి ధారలమీద పడుతూంది. ఆ కన్నీటిధారలను చూచిన నేనేమనగలను? ఎలా ఓదార్చగలను?

"ఈ ప్రపంచం నా పట్ల నిర్దాక్షిణ్యంగా ఉంది. ఉండనీయండి" అంటూ పెల్లుబికివస్తున్న దుఃఖానికి ఆనకట్టను చేర్చి విసవిసా వెళ్ళింది సుందరి నా గది నుండి.

ఆ నాడల్లా సుందరి నాకు కనిపించలేదు. ఏమిడమ్మ నడిగితే, మేడపై తన గదిలో ఏకాంతంగా తలుపులు వేసుకొని ఉందని చెప్పింది. స్నానం చేసిందట. అంతే. భోజనం, కాఫీ ఏమీ తీసుకోలేదట.

ఇంత జరుగుతున్నా దాశరథికి ఏమీ పట్టినట్టు లేదు. అసలు తెలియదు. చదరంగాన్ని గురించి మాట్లాడుతున్నాడు. రాత్రి తనకొక కల వచ్చిందట. అందులో ఎక్కడో ప్రపంచపు చదరంగపు పోటీలలో తాను పాల్గొన్నాడట. ఒకటే ఒక ఎత్తు. . . ఎలా ఏడిందో తనకే తెలియదుట. ఆ పోటీదారులంతా ఆశ్చర్యపోయి తలలూంచారట! ఏదో ఇలా మాట్లాడాడు చాల సేపు.

సాయంత్రం ఆట మొదలుపెట్టి ఆడుతున్నాం కాని, నా మనస్సంతా ఆటమీద లగ్నం కాలేదు. మధుసూదనాన్ని, సుందరిని గురించి ఆలోచిస్తూంది.

"మాష్టారూ, మీ రాజును కాచుకోండి" అంటున్నాడు మధ్యమధ్య దాశరథి.

సరిగ్గా 5 గంటలయి ఉంటుంది. సుందరి మేడ మీదినుండి దిగివచ్చింది. వస్తూనే "మాష్టారూ, బీచికి షికారు వెళదామా?" అంది.

సరేనన్నాను.

దాశరథి "వీలుంటే అక్కడో ఎత్తు వేసికొందాం" అంటూ చదరంగపుసామానుతో బయలుదేరాడు. దార్లో

(తరువాయి 50 వ పేజీలో)

7—6—67

అంతా చెప్పి "పెండ్లికి మధు వస్తాడేమో అనుకొన్నాను . . . రాలేదు. మధు జీవితమూ ఇలాగే సుఖాంతమైతే, నేనుజీవితంలోఓడిపోనట్లు మాష్టారూ" అంది సుందరి.

"సుందరికి జీవితంలో ఓటమి ఉంటుందా?" అనే ప్రశ్న నాలో కొన్ని క్షణాలు సుడులు తిరిగింది.

* * *

చేతిలోని గులకరాయిని విసరి పుచ్చుకొని వేసినట్లు, అక్కడ నుండి 500 మైళ్ళ దూరానికి విసిరివేశారు, బదిలీ అనే పేరుతో నన్ను. దాశరథి, సుందరి సాంగత్యంతో కాలాన్ని మరిచి సుఖిస్తున్న నాకు ఈ బదిలీవార్త బాధాకరమైనా గత్యంతరం లేని వాడు మానవులకు బోనటగా నిలిచే "ఇది జీవితం" అనే వేదాంతాన్ని స్మరించి ఊరుకో కలిగాను. కాని దాశరథి, సుందరి పిడుగు పడినట్లే నిర్ఘాంతపోయారు.

దాశరథి అనాడల్లా చదరంగపు బల్లముందు దిగులుగా కూర్చొండిపోయాడు.

"ఇల్లా జరగటానికి వీలులేదు మాష్టారూ! ఏమయినా సరే, మీరుండి పోవలసినదే. కాకుంటే మాత్రం, ఈ ఉద్యోగం చేయకుంటే . . . ఏం?" అంది సుందరి.

సుందరి భావం నాకు తెలుసు, ఆమె అభిమానానికి కృతజ్ఞత చెప్పి.

"జీవితంలో సంయోగ, వియోగాలు లేకుంటే సంపూర్ణత ఉండదు. ఇది నా అనుభవం" అన్నాను.

"అంతేనంటారా?" అంది దీనంగా.

నా బదిలీ పట్ల సుందరి ఎంతో అసంతృప్తి అనుభవించింది, నేనక్కడున్న చివరి మూడు రోజుల లోను.

ప్రయాణమైన నాడు, దాశరథి, సుందరి రైలు వరకూ వచ్చారు వీడ్కోలు ఇవ్వటానికి. రైలుకు ఆలస్యం ఉంది. దాశరథి నాకు బహుమతి ఇవ్వటానికి తాను ముందురోజు తీసికొని వచ్చిన చదరంగపుబల్ల ఇంటిదగ్గిరే మరిచిపోయి వచ్చానని తిరిగి వెళ్లాడింటికి.

నేనూ సుందరి ప్లాట్‌ఫారమ్ మీద అటూ, ఇటూ నడుస్తూ కబుర్లలో పడ్డాం. ఆ ఊరిలోని నా ఉద్యోగకాలం, వారితో నా పరిచయం, ప్రేమతో అన్యోన్యంగా ఉండిపోయింది సమీక్షించి సింహావలోకనం చేసుకొన్నాము.

ఎంతటి మధురస్మృతి!

"మాష్టారూ, అమ్మా, నాన్న ఎలా ఉండేవారో సరిగా గుర్తులేదు. ఆ ఆత్మబంధువులు ఏనాడో విడనాడి పోయారు. అలాగే ఒక్కొక్కరే వారి ఆత్మీయులను పంచిపెట్టి విడనాడిపోతున్నారు. ఈ నాడు మీరు వెళ్ళిపోతున్నారు. మిగిలింది మామయ్య ఒక్కరు. ఆ మామయ్య, ఏనాడో ఈ ప్రపంచపు ఏ మారుమూలకో చదరంగపు మిత్రులను వెతుక్కొంటూ వెళ్ళిపోతారు. నే నొక్కర్తెను, ఏకాకినిగా మిగిలిపోతాను కదూ?. . ." అంది సుందరి.

సుందరి మోముకేసి చూచాను.

రెండు కనులలోనూ, ముత్యాల్లా రెండు కన్నీటి కణాలు, వాటిలో తీరని అసంతృప్తి. . . బేలతనం. మొదటి సారిగా నాకు సుందరి స్త్రీగా, అసహాయినిగా కనిపించింది.

"అవును. సుందరి స్త్రీ! ఆమెకూ తోడూ, నీడా,

కావాలి' అనిపించింది.

ప్లాట్‌ఫారం చివర గానుగచెట్టు; దానికింద సిమెంటుబల్ల. దాని మీద కూర్చొంటూ—

"ఒక్క విషయం అడుగుతాను చెప్తావా?" అన్నాను

'ఏమిటి?' అన్నట్టు చూచింది.

"నీకసలు వివాహం చేసుకోవాలని ఉందా?" అన్నాను. ఎటో చూస్తున్నట్టు ఉండిపోయి పొడిగా నవ్వటానికి ప్రయత్నం చేసింది.

"స్త్రీకి జీవితంలో తోడు కావాలి. ముఖ్యంగా నీడకావాలి—"అన్నాను. కొన్నిక్షణాలు ఆలోచిస్తున్నట్లే ఉండిపోయింది.

"భగవంతునిలాంటి వ్యక్తి తోడునీడగా దొరికితే స్వీకరించాలనే ఉంది మాస్టారూ" అంది.

ఏమిటో ఆమె విచిత్రమైన వ్యక్తి. అంతకంటే మరేమీ ఆలోచించటానికి టైము లేకపోయింది, రైలు ప్లాటుఫారంమీదకు వస్తున్నట్టు కనిపించటంతో. దాశరథి వచ్చాడు. బరువైన హృదయంతో వారి దగ్గర నుండి సెలవు తీసుకొన్నాను.

* * *

నేను కొత్తగా వచ్చిన ప్రాంతమంతా పుణ్యక్షేత్రాలతో నిండి ఉన్న ప్రాంతం. ఓసారి ఏదో మేళాలాంటిది జరుగుతూ ఉంటే, దానిలో భావరాజు కనిపించాడు. నేను గుర్తు పట్టలేదు. అతనే గుర్తు పట్టి "మాస్టారూ" అంటూ వచ్చాడు. చాలా మారిపోయాడు. వెనకటి ఆ జానపాలజుట్టు లేదు. కత్తిరించి హాయిగా క్రాఫ్ చేయించుకొన్నాడు. చూపు కూడా ఎటో చూస్తున్నట్లు కాక బాగానే ఉందనటానికి నిదర్శనం, అంతటి ప్రజలో అతగాడు నన్ను గుర్తించటమే. ప్రక్కనే భార్య ఉంది. నాకు పరిచయం చేస్తూ "మాస్టారు అని చెప్పేవాణ్ణి, వారే వీరు" అన్నాడు.

అంతటి వీధిలోను, నేనెంత వారించినా వినకుండా వంగి నా పాదాలకు నమస్కరించింది.

"సుమంగళీ భవ" అన్నాను.

నా నివాసానికి రమ్మన్నాను. కాదని, వాళ్ళ హోటలుకు తీసికొని వెళ్ళారు నన్ను.

భావరాజు చెప్పిన మరో విషయం—మధుసూదనం పెళ్ళిని గురించి. ఎవరో పెద్ద వ్యాపారస్థుని కుమార్తెను పెండ్లి చేసుకొన్నాడట. ఇప్పుడు మామగారితో కలిసి వ్యాపారం చూచుకొంటున్నాడట.

మధుసూదనం భగ్నప్రేమికుడిలా మారిపోయాడని ఏ నాడూ భావించని, నాకీ వార్త ఎలా జరగాలో అలా జరిగింది అనిపించింది.

సుందరి విషయం అడిగాను.

తెలియదన్నాడు. ఎమ్. ఎ. ఫిలాసఫీలో చేరినట్లు చెప్పాడు. ఆమె జీవితాన్ని అటవస్తువుగా చేసి కొంటున్నదట. "స్త్రీకి అంతటి స్వేచ్ఛ పనికిరాదు. దానివలన అనర్థాలేమిటో సుందరి జీవితమే సాక్ష్యం" అంటూ, చాలాసేపు మాట్లాడాడు, సుందరి గురించి ఏమీ తెలియదని ప్రారంభించిన భావరాజు.

ఆ మరునాడు భావరాజు, అతని భార్య వెళ్ళిపోయారు.

"ఉంటాను బాబాయిగారూ" అంటూ సెలవు తీసుకొంది అతని భార్య విశాలాక్షి. ఆ ఒకటిన్నర రోజులలో, విశాలాక్షిని పరిశీలించి చూచాను. సుందరి ఆమెను గురించి చెప్పిన మాటలు నిజం. జీవితంలో భావరాజుకు ఆమె తోడు, నీడ కావాలి.

భావరాజు కనిపించి వెళ్ళటంతో సుందరి ఆలోచన ఎక్కువయింది నాలో. అంతకుముందు మరిచానని కాదు. ఆమె మరుపురాని వ్యక్తి.

ఈ సారి అక్కడినుండి బదిలీ త్వరగానే అయింది ఉత్తరదేశపు ప్రాంతానికి. వెళ్ళి చేరాను.

ఆరునెలల తరవాత అనుకోని సంఘటన జరిగింది. ఒకనాటి పొద్దున్నే హోటల్‌లో కాఫీ తాగి వస్తున్నాను. దాశరథి *ఎదురయ్యి ఉమాంతం కౌగలించుకొన్నాడు.* ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

తానూ, సుందరి ఉత్తరదేశయాత్ర బయలు దేరారట. సుందరి తీర్థయాత్రలో పుణ్యక్షేత్ర దర్శనానికి ప్రాధాన్యమిస్తే, తాను కాస్మొపొలిటన్, మెట్రోపొలిటన్ సిటీస్ చూస్తున్నాడట.

"సుందరి ఎక్కడ?" అన్నాను.

కారులో సూర్యోదయానికి పూర్వమే బయలుదేరి వెళ్ళిందట, దగ్గరలో ఉన్న పుణ్యక్షేత్రాన్ని చూచి రావటానికి, ఈ లోగా తాను ఇక్కడ జరుగుతూన్న ప్రపంచపు చదరంగపు పోటీలను తిలకించటానికి ఉండిపోయాట్ట. రమ్మని లాక్కువెళ్ళాడు.

దాశరథి చెప్పేవరకు చదరంగపుపోటీల విషయమే మరిచిపోయాను. పోటీలు చూస్తున్నంతసేపు తన్మయుడై ఉండిపోయాడు. నాకు మాత్రం 'సుందరిని ఎప్పుడు చూస్తానా?' అనే మనస్సు తొందర పెడుతూంది.

సాయంత్రం ఇద్దరమూ హోటలు గదిలో కూర్చొని సుందరి రాకకోసం ఎదురుచూస్తున్నాం. దాశరథి మధ్యాహ్నం ఆ పోటీలో యుగోస్లోవేకియా పోటీదారు వేసిన ఎత్తును గురించి మాట్లాడుతున్నాడు.

ఆ ఎత్తు సరిగ్గా ఓసారి తాను కలలో ఏదో పోటీలో ఆడుతూ వేసిన ఎత్తు లాంటిదట.

"చూచారా కలలకు అర్థం లేదంటే నేను నమ్మను. ఆ మాటకొస్తే ఈ ప్రపంచపోటీలను చూడాలని ఎన్నాళ్ళనుండి నా కలలు" అంటున్నాడు.

నా మనస్సు సుందరి రాకమీదనే లగ్నం అయి ఉంది.

రాత్రి 8 గంటలకు వచ్చింది. సుందరిని చూస్తూనే ఆశ్చర్యపోయాను.

యోగినిలా కనిపించింది. వదులు వదులుగా వదలి వేసిన కేశాలు. ఆభరణాలులేని మెడ. ఒక్కటే ఒక్క బంగారు సన్నటి గొలుసు, అదేదో జపమాలలా. పెద్ద కుంకుమబొట్టు. పసుపుపచ్చని చీర, చేతిలో పూసజ్జ.

ఆ వేషంలో ఆమె సౌందర్యం ఇనుమడించిందా అనిపించింది.

నన్ను చూస్తూనే "మాస్టారే" అని పొంగి పొరలి పోయింది. "పట్టండి" అని ప్రసాదం, మరచెంబులోని తీర్థం "అకాల మృత్యుహరణం, సర్వపాప నివారణం, శ్రీవిష్ణుపాదోదకం పావనం శుభం" అంటూ ఇచ్చింది.

దాశరథి స్నానం చేస్తానంటూ బాత్‌రూముకేసి వెళ్ళాడు.

"ఏమిటిదంతా?" అన్నాను.

"భగవంతుణ్ణి వెతుక్కొంటూ బయలుదేరాను



సగా

ఫోటో—బి. శంకరరావు (సికిందరాబాదు)

మాస్టారూ! మీరు కనిపించారుగా."

"కొంపదీసి నన్ను భగవంతుణ్ణిగా చేస్తావా ఏమిటి?"

"ఏం?"

"అదేమిటి సుందరీ, నీవు పిలిస్తే ఏనాడైనా పలుకకుండా ఊరుకొన్నానా నేను?"

సుందరి నవ్వింది.

"కాని, మాస్టారూ, భగవంతుడు నాకు పలుకుతూనే ఉన్నాడు ప్రతి పుణ్యక్షేత్రంలోను. ఎటొచ్చి, ఆ దివ్యమంగళ స్వరూపంలో కనిపించటం లేదు. అందుకే ఈ అన్వేషణా, శోధనా సాగిపోతున్నాయి" అంది అర్ధ నిమీలితనేత్రాలతో సుందరి.

"నీ కెందుకా భగవంతుడు?" అన్నాను.

"ఎందుకేమిటి మాస్టారూ! నేను స్త్రీని. నాకు తోడు, నీడ కావాలి. కనిపిస్తే ఆ సత్యస్వరూపునికి పాదదాసినై కైంకర్యమాడామని."

నేనేమీ మాట్లాడలేకపోయాను. నిశ్చేష్టితుణ్ణి అయి సుందరికేసి చూస్తూ ఉండిపోయాను.

ఆ తరవాత ఎన్నో మాట్లాడుకున్నాం. తాను తిరిగిన క్షేత్రాలను గురించి చెప్పింది. ప్రసంగంలో భావరాజు కనిపించిన సంగతి చెప్పాను. ఆ మధ్య భావరాజు దంపతులను, మధుసూదనం దంపతులను రమ్మని ఆహ్వానించిందట. భావరాజునుండి జాబే లేదట. మధు దంపతులు ఓ పది రోజులుండి వెళ్ళారట. మధు నూతన జీవితంపట్ల సంతృప్తి వెల్లడించింది సుందరి.

ఆ మరునాడు సుందరి, దాశరథి బదరీనాథ్ వెళ్ళారు. నన్నూ రమ్మంది సుందరి.

సుందరి సాధించిన పరిపక్వస్థితి నా కింకా రాలే దనిపించింది. వాళ్ళ వెంట వెళ్ళలేకపోయాను.

ప్రయాణం అయి వెళుతూ "ప్రతి పుణ్యక్షేత్రంలోను మీరు మళ్ళీ కనిపించాలని భగవంతుణ్ణి వరం అడుగుతూ వెళతాను మాస్టారూ—" అంది సుందరి.

వాళ్ళు వెళ్ళాక ఆలోచించాను.

*మధుకు, భావరాజుకు తోడునీడ ఏర్పడ్డారు;* సుందరికి లోకరక్షకుడే తోడూ నీడ. నే నెవ్వరిని గురించి బాధ పడనక్కరలేదు. ★